


నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, ఆదివారం 19 జనవరి 2025 RANGAREDDY



### వాహనం కండిషన్‌లో ఉంటే

# ఎన్నేండ్లైనా రెన్యువల్

**15 ఏండ్లు దాటితే ఐదేండ్లకోసారి క్రమబద్ధీకరించుకోవచ్చు**

**నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనాలకే ఈ సౌలభ్యం**

**ట్రాన్స్‌పోర్టు వాహనాలకు మాత్రం స్క్రాప్ నిబంధన వర్తింపు**

సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : తమ వాహనాలు 15 ఏండ్లు దాటాయి కాబట్టి ఇక తుక్కుకు పంపాలేమోనన్న దిగులు ఇక వద్దు. నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు అలాంటి పరిమితి ఏమీ లేదు. సాధారణంగా ఏ వాహనమైనా రోడ్లపై పయనించేందుకు 15 ఏండ్లు గడువు ఉంటుంది. ఆ గడువు మీరితే తుక్కుకు పంపే అవకాశం ఉంటుంది. అయితే అదే వాహనాన్ని వినియోగించుకోవాలనుకుంటే రెన్యువల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. 5 ఏండ్ల వరకు ఆ వాహనానికి అనుమతి లభిస్తుంది. ఇలా అనుమతి లభించిన వాహనం 5 ఏండ్లు దాటినా మరోమారు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రత్యేకమైన కాల పరిమితి అంటూ ఏమీ లేదని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు వాహన గడువుకు సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేవని పేర్కొన్నారు. 15 ఏండ్లు దాటితే తుక్కుకు పంపాలనే నిబంధనలు జీహెచ్ఎంసీ పరిధిలో తిరుగుతున్న ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తాయని వెల్లడించారు. చాలా మంది నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహనదారులు తమ వాహన గడువు ముగిసిందని బ్రోకర్లను ఆశ్రయించి డబ్బులు నష్టపోతున్నారని, వాహన సామర్థ్యం మేరకు ఎన్నేండ్లైనా వాహనాన్ని రెన్యువల్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

**రెన్యువల్‌ను అధికారులు ధ్రువీకరించాలి**

నాన్‌ట్రాన్స్‌పోర్టు వాహన సామర్థ్యాన్ని బట్టి దఫదఫాలుగా 5 ఏండ్లు రెన్యువల్ చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే సంబంధిత వాహనాన్ని ఆర్టీఏ అధికారులు ధ్రువీకరించాలి. ఈ క్రమంలో ద్విచక్ర, ఫోర్ వీలర్ వాహనాలకు గ్రీన్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. 15 ఏండ్లు నిండిన ద్విచక్ర వాహనానికి సాధారణ ఫీజు 1435తో పాటు 2వేలు గ్రీన్ ట్యాక్స్ చెల్లించాలి. గడువు ముగిసిన రోజులకు అంటే నెలకు రూ.300 చెల్లించాలి. ఈ మొత్తం ఫీజు మీసేవలో సంబంధిత ఆర్టీఏతో చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆధార్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, ఆర్‌సీ తదితర పత్రాలతో ఆర్టీఓ కార్యాలయంలో దాఖలు చేయాలి. అనంతరం ఆ వాహనం మరో ఐదేండ్లు వినియోగించడానికి అనుమతి లభిస్తుంది. ఇదే లెక్కన 15 ఏండ్లు నిండిన ఫోర్ వీలర్ అయితే సాధారణ ఫీజు రూ.5,835తో పాటు గ్రీన్ ట్యాక్స్ రూ.5000లు ఉంటుంది. గడువు ముగిసిన పెనాల్టీ అంటే నెలకు రూ.500లు ఉంటుంది. ఈ మొత్తం ఫీజును మీ సేవలో చెల్లించి ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఫోర్ వీలర్ 20 ఏండ్లు వినియోగించి ఉంటే గ్రీన్ ట్యాక్స్ రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు. దీంతో మరో ఐదేండ్ల వరకు వాహనం వినియోగించే వీలు ఉంటుందని వివరించారు. గ్రేటర్‌లో 15 ఏండ్లు గడువు ముగిసిన వాహనాలకు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలంటూ అధికారులు సూచించారు.

**గ్రేటర్‌లో కాలం చెల్లిన వాహనాలు ఇలా!**

| | |
|---|---|
| ద్విచక్ర వాహనాలు | 17 లక్షలు |
| కార్లు | 3.5 లక్షలు |
| గూడ్స్ క్యారేజెస్ | 1లక్ష |
| ఆటోలు | 20వేలు |
| ఇతర వాహనాలు | 9వేలు |



నానక్‌నగర్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

**ఓవైపు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు.. మరోవైపు ఫార్మా విలేజ్ బాధితుల ఆందోళనలు**

**ఎక్కడికక్కడ అణచివేస్తున్న పోలీసులు**

**కోర్టు అనుమతించినా పోలీసులు అడ్డుకోవడంపై రైతుల ఆక్షేపణ**

## రైతు ఉద్యమాలపై

# పోలీసుల నిర్బంధం

రంగారెడ్డి, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో రైతు ఉద్యమాలపై పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నది. పోలీసులు ఆంక్షలు విధించి రైతుల హక్కులను కాలరాస్తున్నారు. జిల్లాలో ఓవైపు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ, మరోవైపు ఫార్మా విలేజ్ కోసం బలవంతంగా పట్టా భూములు తీసుకున్నారని, తమ భూములను తమకు తెలియకుండానే నిషేధిత జాబితాలో చేర్చారంటూ కొంతకాలంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆందోళనపై పోలీసుల నిర్బంధంతో తొక్కిపెట్టి రైతుల భూములను యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. జిల్లాలోని కందుకూరు, యాచారం మండలాల్లో గతంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూములను సేకరించింది. కొన్ని పట్టాభూములు కూడా తీసుకోవాలని నిర్ణయించగా, రైతులు నిరాకరించి కోర్టును ఆశ్రయించారు. దీంతో గత ప్రభుత్వం పట్టా భూములు తీసుకునే విషయంలో వెనకడుగు వేసింది. ఈ సమయంలోనే సాధారణ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో తమను గెలిపిస్తే రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి ఆ భూములను రైతులకే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు రైతులకు హామీ ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రైతుల భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించకపోగా, వారు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో యాచారం మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లో సుమారు రెండు వేల ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నది. ఈ భూములకు సంబంధించిన రైతులు ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో శాంతియుతంగా ఆందోళన చేపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకడుగు ముందుకేసి ఆందోళనలపై నిషేధం విధించింది. అనుమతులు లేకుండా ఆందోళనలు చేస్తే కేసులు పెడతామని ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని, రైతుల హక్కును కాలరాయొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో శనివారం ఫార్మా భూ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నానక్‌నగర్ గ్రామంలో ఫార్మాకు వ్యతిరేకంగా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమతులు లేకుండా కార్యక్రమాన్ని చేపట్టవద్దంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రైతులు, ఫార్మా భూ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. హైకోర్టు ఆదేశాలను ఖాతరు చేయకపోవటంపై పలువురు రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

### గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సర్వే.. హద్దురాళ్ల ఏర్పాటు

జిల్లాలో కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి ఫోర్త్‌సిటీ మీదుగా ఆకుతోటపల్లి వరకు ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం ప్రభుత్వం భూ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. రోడ్డు కోసం తమ భూములను తీసుకోవద్దంటూ ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టినప్పటికి భూసేకరణకు ప్రభుత్వం సిద్ధమైంది. 41కిలోమీటర్ల రోడ్డు కోసం రైతుల నుంచి సుమారు వెయ్యి ఎకరాలను సేకరించింది. 330 అడుగుల వెడల్పుతో చేపట్టే ఈ రోడ్డుకు తమ పట్టా భూములను బలవంతంగా తీసుకోవద్దంటూ సర్వేకు అడుగడుగునా అడ్డు తగిలారు. ఈ సందర్భంగా పోలీసులు సర్వే నిర్వహించే గ్రామాల్లో పెద్ద ఎత్తున మోహరించి రైతులను ఎక్కడికక్కడ అడ్డుకుని బలవంతంగా సర్వే నిర్వహించి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. తమ పట్టా భూములను నమ్ముకుని ఎన్నో ఏండ్లుగా జీవిస్తున్నామని, తమను రోడ్డుపాలు చేయవద్దని కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు.

## రైతు భరోసాలోనూ..

# కోత!



**రైతు భరోసా అర్హులను తగ్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు**

**మండలాల వారీగా సర్వే షురూ**

**రుణమాఫీలో అర్హులకు అన్యాయం**

**బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు సాయం**

**జిల్లావ్యాప్తంగా 12.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములు**

**బీఆర్‌ఎస్ హయాంలో ప్రతీ సీజన్‌కు 6 లక్షలకుపైగా ఎకరాలకు రైతుబంధు**

**రైతు భరోసాపై జిల్లా రైతాంగంలో అయోమయం**

*కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రుణమాఫీ, రైతు భరోసా కింద రూ. 15 వేల ఆర్థిక సాయం అందిస్తామని తదితర హామీలిచ్చిన రేవంత్ ప్రభుత్వం రైతులకు మరోసారి అన్యాయం చేసేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే రూ.2 లక్షల్లోపు రుణమాఫీ అంటూ అర్హులైన లక్ష మంది రైతులకు అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు భరోసాలోనూ అదే తీరును వ్యవహరిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు ఏడాదికి రూ. 10 వేల రైతు బంధు సాయాన్ని అందజేస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద రూ. 15 వేలు ఇస్తామని అబద్ధపు హామీలనిచ్చి.. ప్రస్తుతం రూ. 12 వేలు ఇస్తామంటూ రేవంత్ సర్కార్ రైతులను మోసం చేస్తున్నది. దీనికితోడు లేనిపోని కొర్రీలు పెట్టి అర్హులనూ తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నది. ఇందుకుగాను సర్వే నిర్వహించేందుకు రెవెన్యూ-వ్యవసాయ శాఖలకు బాధ్యతలను అప్పగించింది. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల వరకు కోత విధించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. జిల్లావ్యాప్తంగా 12.35 లక్షల ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. వీటిలో అర్హులైన వారిని గుర్తించి ప్రతీ సీజన్‌కు 6 లక్షల ఎకరాలకు రూ.300 కోట్లకుపైగా రైతుబంధు సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే వ్యవసాయ భూముల్లో నెలకొల్పిన పరిశ్రమలతోపాటు లే అవుట్లు ఇతరత్రా వివరాలను సేకరించిన ప్రభుత్వం వ్యవసాయానికి యోగ్యమైన భూములకు మాత్రమే ప్రతీ గుంటకు పెట్టుబడి సాయాన్ని అందజేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని కొర్రీలు పెట్టి రైతు భరోసాలో కోత పెట్టే దిశగా జిల్లా యంత్రాంగం అడుగులు వేస్తున్నది.*

*- వికారాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ)*

**రైతు భరోసాపై అయోమయం..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.15 వేల పెట్టుబడి సాయం అందజేస్తామని హామీనిచ్చి... ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామన్న ప్రకటనతో రైతుల్లో అయోమయం నెలకొన్నది. ఇటీవల రైతు భరోసాకు సంబంధించి సమావేశమైన మంత్రిమండలి సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన తర్వాత ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. పట్టాదారు పాసు పుస్తకాలను పరిగణనలోకి తీసుకోకుండా రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకొని రుణమాఫీ విషయంలో చాలా మంది రైతులకు అన్యాయం చేసింది. అదే తీరును రైతు భరోసాలోనూ వ్యవహరిస్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్బండ వర్ణాలకు సంక్షేమ ఫలాలు అందగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పథకంలోనూ కోతలు విధిస్తూ అర్హులకు అన్యాయం చేస్తున్నది.

**బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతీ ఎకరాకు సాయం..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ ఎకరాకు రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని అందజేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద రూ.2926 కోట్ల సాయాన్ని రైతులకు పెట్టుబడి నిమిత్తం అందజేశారు. 2018 వానకాలం సీజన్‌లో 1,94,833 మంది రైతులకుగాను రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మంది రైతులకు రూ.206 కోట్లు, 2019 వానకాలం సీజన్‌లో 1,78,998 మంది రైతులకుగాను రూ.255 కోట్లు, యాసంగి సీజన్‌లో 1,71,824 మంది రైతులకు రూ.194 కోట్ల పెట్టుబడి సాయం, 2020 వానకాలం సీజన్‌లో 2,113,341 మంది రైతులకు రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మంది రైతులకు రూ.301 కోట్లు, 2021 వానకాలం సీజన్‌లో 2,25,438 మంది రైతులకు రూ.300 కోట్లు, యాసంగిలో 2,24,928 మంది రైతులకు రూ.241 కోట్ల పెట్టుబడి సాయాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందజేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వానకాలం సీజన్‌లో 2,47,707 మంది రైతులకు రూ.305 కోట్లు, యాసంగిలో 2,43,447 మంది రైతులకు రూ.299 కోట్లు, 2023-24 వానకాలం సీజన్‌లో 2,62,065 మంది రైతులకు రూ.307.47 కోట్ల పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జమ చేసింది.

### రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి

**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి**




గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు

రంగారెడ్డి, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా సైబరాబాద్ ట్రాఫిక్ కమిషనర్, రాచకొండ ట్రాఫిక్ కమిషనర్, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులతో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు -2025, రోడ్డు సేఫ్టీ సంబందించిన వివిధ విషయాలపై సమీక్షించారు. ఆయాశాఖల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి ట్రాఫిక్ కమిషనర్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025 ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో మోటరు వాహనాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్‌గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల బారినపడిన వారి కుటుంబ సభ్యులు అనాథలవుతున్నారన్నారు. అధికారులుగా మనం కలిసి విధులు నిర్వహిస్తూ, అవగాహన కార్యక్రమాలు చేపడితే ప్రమాదాలను తగ్గించవచ్చునని అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల భాగంగా జనవరి 1 నుంచి 31వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో విద్యార్థులతో ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం, రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం అనే నినాదాలతో అమూల్యమైన సందేశాన్నిచ్చి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలిసి శ్రమిద్దామని తెలిపారు. ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదం జరిగిన వెంటనే ప్రమాద స్థలానికి కమిటీలు చేరుకుని ప్రమాదానికి కారణమైన వివరాలను సేకరించి ప్రత్యామ్నాయ చర్యల కోసం ఉన్నతాధికారులకు తెలిపేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సంగీత, జడ్పీసీఈవో కృష్ణారెడ్డి, డీపీవో సురేశ్‌మోహన్, ట్రాఫిక్ అధికారులు, ఆర్టీసీ ఆర్‌ఎం, రోడ్స్ అండ్ బిల్డింగ్ అధికారులు పాల్గొన్నారు.